# 'డెల్.. బెల్' మోగించనున్న ఏపీ

- పెట్టుబడులపై రెండు ప్రముఖ సంస్థల ఆసక్తి
- అమెరికాలో చంద్రబాబుతో ప్రతినిధుల భేటీ
- డల్లాస్‌లో ఘన స్వాగతం

ఈనాడు - అమరావతి

అమెరికాకు చెందిన రెండు ప్రఖ్యాత సంస్థలు డెల్, బెల్ ఆంధ్రప్రదేశ్‌పై మక్కువ చూపాయి. రాష్ట్రంలో శాఖలను ప్రారంభించడంపై ఆసక్తి కనబరిచాయి. అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బృందం ఈ రెండు సంస్థల ప్రతినిధులతో భేటీ అయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆహ్వానానికి వారు సానుకూలంగా స్పందించారు. బెల్ హెలికాప్టర్ కంపెనీ డైరెక్టర్ చాద్ స్పార్క్స్ చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో తయారీ కేంద్రం ఏర్పాటుకున్న అవకాశాలు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. డల్లాస్‌లో డెల్ సంస్థ ప్రతినిధి శ్రీకాంత్ సత్య చంద్రబాబుతో సమావేశమయ్యారు. అమరావతి లోగానీ, మరెక్కడైనాగానీ డేటా సెంటర్ ఏర్పాటుకు డెల్ ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు.



ఆదివారం అమెరికాలోని డల్లాస్‌లో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని బృందం

## ప్రతి ఒక్కరూ ఒక బాహుబలి కావాలి

అమెరికాలో స్థిరపడ్డ తెలుగువారిలో ప్రతి ఒక్కరూ ఒక బాహుబలి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఉపాధి కోసం అమెరికాకు వచ్చిన తెలుగువారు పారిశ్రామికవేత్తలుగా అద్భుత ఫలితాలు సాధిస్తూ ఈ రంగంలో యూదులనే మించిపోయారని కొనియాడారు. స్థానికులతోనూ సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని, వారితో మమేకమైతే ఎలాంటి సమస్యలు ఉండవని హితవు చెప్పారు. మూడో రోజు అమెరికా పర్యటనలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున ముఖ్యమంత్రి డల్లాస్ చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో తెలుగువారు, తెదేపా అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఏపీ ఎన్ఆర్‌టీ సంస్థ ఆధ్వర్యంలో డల్లాస్‌లో ఏర్పాటు చేసిన ప్రవాస తెలుగువారి సమావేశంలో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా ప్రసంగించారు. ఇక్కడి తెలుగువారు ఐటీ సర్వీసెస్ అలయెన్స్ పెట్టారు. దానిలో 750 కంపెనీలు భాగస్వాములుగా ఉన్నాయి. నేను ఒక యజ్ఞంలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాను. మీరూ భాగస్వాములు కావాలి. రాబోయే ఐదు పదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వాహనాల్ని ఎలక్ట్రిక్ వాహనాలుగా మారుస్తాం. అమరావతిని నాలెడ్జ్ హబ్‌గా, రీసెర్చ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం' అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

బహుశా ప్రపంచంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన మొదటి రాజకీయ నాయకుడిని తానేనని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఒక రాజకీయ నాయకుడు ఇలా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వడం మొదటిసారి చూస్తున్నానని అప్పట్లో గేట్స్ తనను ప్రశంసించినట్లు చెప్పారు.

## ఏపీకి వచ్చేందుకు 28 సంస్థల ఆసక్తి

అమెరికాలో ఐటీ సేవల రంగంలో పేరెన్నిక గన్న, తెలుగువారు నిర్వహిస్తున్న 28 సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో అడుగు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయి. ఆ సంస్థల ప్రతినిధులు డల్లాస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిశారు. ప్రీమియర్, గ్లోబల్ ఔట్ లుక్, టెక్‌ప్రోస్ సాఫ్ట్‌వేర్, ఆర్యస్‌టెక్, శ్రీటెక్, మద్ది సాఫ్ట్, గురూస్ ఇన్ఫోటెక్, ఏఈ ఇన్ఫోటెక్, ఆక్టస్ వంటి కంపెనీలు వీటిలో ఉన్నాయి.

## తెలుగు భాషా కేంద్రానికి రూ.6 కోట్లు

ప్రతి ఇంట్లో ఒక కంప్యూటర్ నిపుణుడు, ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్త, ఒక కూచిపూడి నాట్యకారుడు ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. శనివారం సిలికానాంధ్ర యూనివర్సిటీని ఆయన సందర్శించారు. వర్సిటీలో అమరావతి తెలుగు భాషా కేంద్రం (అమరావతి స్కూల్ ఆఫ్ తెలుగు లింగ్విస్టిక్స్) ఏర్పాటుకు రూ. 6 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.

## విదేశీ చదువులకు ఆర్థిక సాయం

ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, బ్రాహ్మణ, మైనార్టీ వర్గాలకు చెందిన 2100 మంది విద్యార్థుల విదేశీ చదువులకు ఆర్థిక సాయం చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో అమెరికాలో చదువుతున్న విద్యార్థులు డల్లాస్‌లో చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు.